క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

నాతవరం : మర్రిపాలెం కస్తూర్బా పాఠశాలలో 2025, 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.భవానీ అన్నారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం 49 సీట్లు, 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే 7,8,9,10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 11వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9666801458, 9505455172 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



ఎం.కోడూరులో భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్ : ఎం. కోడూరు గ్రామంలో పడాల వారి వీధిలో నూతనంగా నిర్మించే కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శనివారం భూమి పూజ చేశారు. ఎంపీటీసీ సభ్యులు నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కోన సతీష్

నర్సీపట్నం: విద్యార్థులు బాగా చదువుకొని పోటీ పరీక్షల్లో రాణించాలని ఏపీసీపీఎస్ అధ్యక్షుడు గాడి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని రిషీ డిగ్రీ కాలేజీలో ఫేర్‌వెల్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించి కళాశాలకు పేరు తీసుకు రావాలన్నారు. కరస్పాండెంట్ కోన సతీష్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎస్సై రిక్రూట్‌మెంట్‌లో కళాశాల నుంచి ముగ్గురు ఎంపిక అయ్యారన్నారు. ఈ వేడుకల్లో డైరెక్టర్ ఆర్.వై.నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన భగవద్గీత అధ్యయనం కార్యక్రమం



సత్యం మాస్టారు దంపతులను సత్కరిస్తున్న నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముత్యాలనాయుడు

చోడవరం : స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రాచుర్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రముత్యాలనాయుడు అన్నారు. స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గత 120 రోజులుగా సంపూర్ణ శ్రీమద్భగవద్గీత అధ్యయనం కార్యక్రమం శనివారంతో ముగిసింది. 120 రోజుల పాటు 701 శ్లోకాలను 18 అధ్యాయాలు పారాయణం, చదవడం, నేర్పించిన సత్యం మాస్టారు దంపతులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

అదనపు నిధులు సద్వినియోగం చేసుకోండి



తామరం హౌసింగ్ కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ, ఇతర అధికారులు

మాకవరపాలెం : గృహనిర్మాణాలకు ప్రభుత్వం అందజేస్తున్న అదనపు నిధులను సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణశాఖ ఎస్ఈ జయరామాచారి లబ్ధిదారులకు సూచించారు. తామరంలోని హౌసింగ్ కాలనీని ఆయన శనివారం సందర్శించారు. లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు గృహాలను నిర్మించేందుకు గతంలో మంజూరు చేసిన రూ.లక్షా 80 వేలతోపాటు అదనంగా మరో రూ.50 వేలు అందజేస్తుందని, లబ్ధిదారులు దీనిని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా పీడీ శ్రీనివాసరావు, ఈఈ నీరజ, డీఈ రాజు, ఏఈ రమణ ఉన్నారు.



నాతవరం నర్సీపట్నం మండలాల సరిహద్దులో రోడ్డుపై వాలి ఉన్న భారీ వృక్షం



రోడ్డుపైకి వాలిపోయి ఉన్న చెట్లు

రోడ్డు మార్జిన్‌లో కూలడానికి సిద్ధంగా..

నాతవరం : నర్సీపట్నం తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీ వృక్షాలు కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. మండలంలో ఎం.బెన్నవరం పంచాయతీ శివారు నర్సీపట్నం మండలం సరిహద్దులో భారీ వృక్షం ఈదురు గాలలకు రోడ్డుపై వాలిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఈ భారీ వృక్షం కారణంగా ఎత్తయిన లోడుతో వచ్చే వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా డ్రైవింగ్ చేసినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇటీవల పాడేరు రాజమండ్రి తిరిగే ఆర్‌సీ బస్సుకు భారీ వృక్షం వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇవ్వడానికి ఈ చెట్టు వద్ద రోడ్డు మార్జిన్ చివరకు వెళ్లడంతో రోడ్డుపైకి వాలి ఉన్న భారీ వృక్షం



గాంధీనగరం తాండవ జంక్షన్ మధ్య రోడ్డు మార్జిన్ కప్పేసినట్టు దర్శనమిస్తున్న వెదురుపొంతలు

పైభాగం తగిలి పెద్ద శబ్దం వచ్చింది. ఈ శబ్దానికి బస్సులో ప్రయాణికులు భయాందోళనతో పెద్దగా కేకలు వేశారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే అనేక వాహనాలకు ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. ములగపూడి వద్ద కాలం చెల్లిన **భారీ మర్రిచెట్లు రోడ్డు మార్జిన్‌లో ప్రమాదకరంగా ఉన్నాయి. మొదట్లో ఈ రోడ్డు చాలా చిన్నగా ఉండేది. ఇటీవల కాలంలో నర్సీపట్నం తుని మధ్య అర్అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో చాలా చోట్ల** రోడ్డు మార్జిన్ చెట్లకు దగ్గరగా వచ్చేసింది. గాంధీనగరం సమీపంలో అటవీశాఖకు చెందిన వెదురుపొంతలు రోడ్డును కప్పేసి ఉన్నాయి. వీటి వల్ల తాండవ జంక్షన్ నుంచి గాంధీనగరం మధ్య ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి వీలవడం లేదు. శృంగవరం గన్నవరం మెట్ట ప్రాంతాల వద్ద కూడా భారీ చెట్లు ప్రమాదాన్ని తలపించేలా దర్శనమిస్తున్నాయి. అర్అండ్‌బీ అధికారులు దృష్టి సారించి ప్రమాదకంరగా ఉన్న చెట్లు తొలగించాలని కోరుతున్నారు.

రాములోరి పెళ్లికి ఏర్పాట్లు

బుచ్చెయ్యపేట : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించే శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, విజయరామరాజుపేట, గున్నెంపూడి, సీతయ్యపేట, రాజాం, దిబ్బిడి తదితర గ్రామాల్లో ఉన్న రామాలయాలకు రంగులు వేసి భారీ విద్యుత్ లైటింగ్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించి భారీ అన్న సమారాధనలు నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద భక్తులకు యువకులు పానకాలు, మజ్జిగ, మంచినీళ్లు అందుబాటులో ఉంచనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కె.కోటపాడు : శ్రీరామనవమి వేడుకలకు మండలంలో రామాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పైడంపేట, బత్తివానిపాలెం, ఎ.భీమవరం, చౌడువాడ, గొండుపాలెం తదితర గ్రామాల్లో గల రామాలయాల్లో సీతారాముల కల్యాణమహోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధనలు జరపనున్నారు. ఆయా ఆలయాల కమిటీల సభ్యులు భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

మాడుగుల రూరల్ : శ్రీరామ నవమి ఉత్సవాలకు మండలంలో రామాలయాలు ముస్తాబయ్యాయి. దాతల సహకారంతో ఆదివారం స్వామి వారి కల్యాణం, అన్న సమారాధాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. కె.జె.పురం రామాలయంలో శనివారం తెల్లవారుజామున ఆఖండ నామ సంకీర్తన ప్రారంభమైంది. ఆదివారం ఉదయం వరకు నామసంకీర్తన జరుగుతుందని భక్తబృందం తెలిపారు.

మాడుగుల : స్థానిక సీతారామస్వామి, గవర వీధిలో వెలసిన రాముల వారి ఆలయాలతో పాటు సత్యవరం, గాదిరాయి, జేడీపేట, సాగరం, కింతి, పొంగలిపాక, గ్రామాలులో ఆదివారం రాములవారి కళ్యాణం నిర్వహించడానికి ఆలయాలను రంగులతో ముస్తాబు చేశారు. ముంగిట చలువ పందిళ్లు ఏర్పాటు చేసి తోరణాలు కట్టారు.

చోడవరం: శ్రీరామనవమి వేడుకలకు బోళ్లవీధి, యడ్లవీధి, గోవాడ, అంబేరుపురం, లక్కవరం, వెంకన్నపాలెం, జుత్తాడ, మైచర్లపాలెం, లక్ష్మీపురం రామాలయాలతోపాటు చోడవరం పట్టణంలో వ్యాపారవీధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణం జరపనున్నారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.



పీడీ పాలెంలో విద్యుత్ లైటింగ్‌లో రామాలయం



చౌడువాడలో వేడుకలకు సిద్ధమైన రామాలయం



కె.జె.పురం రామాలయంలో సీతారామలక్ష్మణులు

చిరుజల్లులతో వేసవితాపం నుంచి ఉపశమనం



వడ్డాది మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం



కె. కోటపాడులో కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట : మండలంలో శనివారం వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. అకాలంగా కురిసిన వర్షంతో వేసవి తాపం నుంచి మండల ప్రజలు సేదతీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండకాసి మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో కారుమబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో వాతావరణం మారిపోయింది. అన్ని గ్రామాల్లో చిరు జల్లులతో వర్షం కురిసింది. గంట సేపు కురిసిన వర్షంతో పలు గ్రామాల్లో రోడ్ల పైన,డ్రైనేజీల్లో వరద నీరు ప్రవహించింది.

మాకవరపాలెం: మండలంలో శనివారం మధ్యాహ్నం గంటపాటు మోస్తరు వర్షం కురవడంతో ప్రజలకు ఎండవేడిమి నుంచి ఉపశమనం లభించింది. మరో వైపు పంటలకు ఈ వర్షం జీవం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కె.కోటపాడు: మండలంలో శనివారం మధ్యాహ్నం ఆకాశం మబ్బుపట్టింది. వెను వెంటనే అరగంట సేపు వర్షం కురిసింది. కె.కోటపాడు, చౌడువాడ, తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. రబీ పంటలు, కూరగాయల పంటలకు వర్షం ఊపిరిపోసింది.



ఇంటి వాకిట్లో చేరిన వర్షపు నీటిని తోడుతున్న వ్యాపారి

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. బండారువీధి, అల్లువారి వీధి, దేవాడవీధులు జలమయ్యాయి. బండారు వీధిలో వ్యాపారం కోసం పలు తినుబండారాలు తయారు చేసి అమ్మకానికి తీసుకెళ్లే సమయంలో ఒక్కసారిగా వర్షం కురవడంతో అవి తడిచి ముద్దవడంతో వ్యాపారి నష్టపోయాడు. పలువురి ఇళ్లల్లోకి నీరు చేరి వస్తువుల తడిచి పోవడంతో నానా ఇక్కట్లు పడ్డారు.

మోదమాంబ ఆలయంలో మాలధారణ

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో భక్తుల మాలాధారణ కార్యక్రమాన్ని శనివారం సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ప్రారంభించారు. వీరవల్లి గ్రామానికి చెందిన గురుస్వామి పాలకుర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం 25 మంది భక్తులు దీక్షలు చేపట్టారు. గొల్లవిల్లి రామారావు, వరహాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఈ భక్తులకు నెల రోజుల పాటు భిక్ష (మధ్యాహ్న భోజనం) సర్పంచ్ సంజీవిరావు దంపతుల సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడ పడాల అప్పలనాయుడు సహకారంతో రాత్రి చద్ది(అల్పాహారం)ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు మాలలు, దీక్షావస్త్రాలు కూడా ఉచితంగా అందిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.



ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో మాలాధారణ చేస్తున్న భక్తులు

లైంగిక వేధింపుల నివారణకు కమిటీలు



ఎస్ఐ భీమరాజు

నాతవరం : ఇటీవల రాష్ట్రంలో విద్యార్థినుల పట్ల పెరుగుతున్న లైంగిక వేధింపులను దృష్టిలో పెట్టుకుని బాలికల రక్షణకు పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మండల వ్యాప్తంగా ఉన్న హైస్కూళ్లలో ప్రతి తరగతికి కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీలో తరగతి విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయిని ఉంటారని, విద్యార్థినులపై వేధింపులను అరికట్టడానికి ఈ కమిటీ దోహదపడుతుందని చెప్పారు. నిత్యం హైస్కూల్‌పై పోలీసులు నిఘా ఉంటుందని, కమిటీ సభ్యులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే బాల్య వివాహాలు నివారించడంపైనా దృష్టి పెడతారన్నారు. ఇప్పటికే నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. ఇంకా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థికసాయం

నర్సీపట్నం : క్యాన్సర్ వ్యాధిలో బాధపడుతున్న మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన సత్యవతికి ఎస్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ప్రతినిధి వెలగా నారాయణరావు రూ.60 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వ్యాధితో బాధపడుతున్న సత్యవతి కుటుంబ పరిస్థితిని చూసి తనవంతు సాయం చేయాలని ముందుకు వచ్చానని నారాయణరావు తెలిపారు. పేదరికంలో ఉన్న సత్యవతి కుటుంబాన్ని తనలాగే దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.



క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సత్యవతికి నగదు అందజేస్తున్న వెలగా నారాయణరావు

క్రికెట్ పోటీలు ప్రారంభం

మాకవరపాలెం : అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అంబేద్కర్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు అంబేద్కర్ జయంతి రోజున నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ మేనేజర్ అల్లంపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బోరు ప్లాట్‌ఫారమ్‌లు బాగు చేయాలి

చీడికాడ: మండలంలో మంచాల గ్రామంలో మంచి నీటి బోరు ప్లాట్‌ఫారంలు పాడై మురుగునీరు, వర్షపు నీరు కలిసి తాగునీరు కలుషితమవుతోందని గ్రామస్తుడు పాటూరి రమణ ఎంపీడీవోకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో మురుగుకాల్వలు శుభ్రం చేయక అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, దీనిపై పంచాయితీ పాలకవర్గం దృష్టి సారించాలని కోరారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా వడ్డాది సినిమాహాలు వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దొండా నరేష్, మంచాల గోవింద, తలిరి శంకర్, శిరిగిరిశెట్టి రాజ, ఇంటి జగన్నాథం పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యాసంస్థల్లో బాబూ జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిం పూలమాల వేసి నివాళులర్పించారు. బాబూ జగజ్జీవన్‌రామ్ ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా అణగారిన వర్గాలవారి సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని కొనియాడారు. అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో బాబూ జగ్జీవన్‌రాం కీలకపాత్ర పోషించారని ఖాసిమ్ తెలిపారు.

నాతవరం : స్వాతంత్ర్య సమరయోధుడు మాజీ దేశ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు మనమంతా ఐక్యతగా పాటు పడాలని జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి అన్నారు. మండల కేంద్రంలో జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. ఎంబీపట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం గ్రామంలో గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాతవరం ఉప సర్పంచ్ అప్పలరాజు, నాతవరం ఎంపీటీసీ -2 చెక్కా ప్రభావతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు జోగిరాజు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టరు పోతురాజు, మాజీ ఎంపీపీ విజయకుమార్, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీటీసీ మాణిక్యం, సూరిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఎం.అలమండలో మహాజన సోషలిస్టు నాయకుడు కంటిపాము కిల్లయ్య, జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మొర్తా శ్రీనివాసరావు తదితరులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా, వ్యవసాయశాఖ, న్యాయ శాఖ, కార్మిక శాఖ, తంతి తపాలా శాఖ మంత్రిగా బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు దేముడుబాబు, రావాడ రాము, చిన్నం ముసలయ్య, నూకరాజు పాల్గొన్నారు.

మాకవరపాలెం: జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని మండలంలోని కొండలఅగ్రహారం, గిడుతూరు గ్రామాల్లో పలువురు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని దళిత సంఘాల నేతలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

చీడికాడ : బాబూ జగ్జజీవన్‌రామ్ జయంతి శనివారం జైతవరం గ్రామంలో నిర్వహించారు. మహాజన సోషలిస్టు నాయకుడు ఎం.నాగరాజు ఆధ్వర్యంలో జగ్జీజీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా మాదిగ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు రావాడ దేముడుబాబు, రాము, వరహామూర్తి పాల్గొన్నారు.



వడ్డాదిలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నాతవరంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



కొండల అగ్రహారంలో జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న స్థానికులు



బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

చోడవరం: అంబేద్కర్ భవనంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి నడుపూరి సన్యాసిరావు, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు చందోలు వెంకటేశ్వరరావు, అంబేద్కర్ ట్రస్టుబోర్డు అధ్యక్ష, కార్యదర్శులు నడుపూరి దేముడు, యర్రంశెట్టి వరప్రసాద్, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు వేచలపు ప్రకాష్ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చోడవరం ఇందిరాకాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు పాల్గొని జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు మూర్తా శ్రీనివాసరావు, ఎలకా మల్లిబాబు, మాలేటి రాజబాబు పాల్గొన్నారు.

మాడుగుల: వొమ్మలి గ్రామంలో యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకట రాజారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపప్రధానిగా జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఎలుసూరి ఘాటీలు, ఎలకా శ్రీనివాసరావు, చెవిటి రవితేజ, మాజీ సర్పంచ్ నందారపు సన్యాసిరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని పెదబొడ్డేపల్లి చెరువు రోడ్డులో ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బేతిరెడ్డి విజయ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అమలాపురం పంచాయతీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శెట్టి అచ్చిరాజు ఆలియాస్ శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. పెదబొడ్డేపల్లి చెరువు రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సీపట్నం ఎస్సీ కాలనీలోని ఎమ్మార్పీస్ నాయకులు ఎం.సతీష్, లోకేష్, దళిత నాయకులు డొక్కా రాజుబాబు తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోలుగుంట: రోలుగుంటలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్,ఎస్. రాజు, ఎంపీటీసీ రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.



కె.కోటపాడులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలను వేస్తున్న డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్.



ఎం.అలమండలో బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు



జైతవరంలో జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులు



వొమ్మలిలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాజారామ్, యువజన సభ్యులు

స్మార్ట్ మీటర్లను తొలగించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న త్రిమూర్తుల రెడ్డి తదితరులు

నర్సీపట్నం : ప్రజలకు పెనుభారంగా మారిన విద్యుత్ ఛార్జీల పెరుగుదలకు కారణమైన స్మార్ట్ మీటర్లను తొలగించాలని టాక్స్ పేయిర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తుల రెడ్డి డిమాండ్ చేశారు. సీఐటీయు కార్యాలయంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇంటి పన్నులు, కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా 15 శాతం నుండి 20 శాతం వరకు ఇంటి పన్నులు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. అనంతరం స్మార్ట్ మీటర్లు తొలగించాలని, ఇంటి పన్ను పెంపు విరమించుకోవాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాయత్రి, టాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ శివ నారాయణరాజు, కార్యవర్గ సభ్యుడు జోగినాయుడు, స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర నాయకుడు చిట్టియ్య, ఎస్టీ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు ధనార్జన్ పాల్గొన్నారు.